సాక్షి
నిర్మల్
సోమవారం । 6 । నవంబర్ । 2023



గుస్సాడీ షురూ..

ఆదివాసీలకు పండుగ భావించే దండారీ ఉత్స వాలు రానే వచ్చాయి. నేటి నుంచి కొన్నిచోట్ల ప్రారంభం కాగా, రెండు రోజుల తర్వాత ప్రతీచోట జరగనున్నాయి. 10లో▸



విషాదం నింపిన వేడుకలు

కుమురంభీం వర్ధంతి కార్యక్రమం నిర్మల్ జిల్లా లో విషాదం నింపింది. జెండా ఎగురవేసే ప్రయ త్నంలో విద్యుత్‌షాక్‌తో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రాత్రి చలి ప్రభావం స్వల్పంగా పెరుగుతుంది.

ఆ పార్టీల సంగతేంది..!

- బరిలో నిలిచిన బీఎస్పీ
- నిర్మల్‌లో ఆప్, ఫార్వర్డ్‌బ్లాక్
- ఉద్యమాలకే పరిమితమైన 'లెఫ్ట్'
- పోటీ చేయని ఎంఐఎం, వైఎస్‌ఆర్‌టీపీ
- జాడలేని టీజేఎస్, జనసేన
- పోటీలోనే లేని 'సైకిల్'



ఖానాపూర్ బీఎస్పీ అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్

నిర్మల్ ఆప్ అభ్యర్థి సయ్యద్‌హైదర్

ఫార్వర్డ్‌బ్లాక్ నిర్మల్ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్: ఎన్నికల సంగ్రామంలో నామినేషన్ల ఘట్టం కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లనూ సమర్పించారు. మరికొందరు నాలుగైదు రోజుల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులెవరో తేలిపోయింది. ఇక రాజకీయంగా ఉనికి చాటుకుంటున్న మిగతా పార్టీల నుంచి ఎవరు బరిలో నిలుస్తున్నారన్న చర్చ కొనసాగుతోంది. ఇందులో టీడీపీ గతంలో ఘనంగా నిలిచి పార్టీ కానీ.. ఇప్పుడు కనీసం పోటీలో కూడా లేని దుస్థితికి చేరుకుంది. ఇలా పలు పార్టీలు జిల్లాలో పోటీకి దూరంగా ఉండిపోయాయి. ప్రధాన పార్టీల్లో టికెట్ దొరకక తమ పార్టీల్లో చేరుతారన్న ఆశతో ఎదురుచూసినా అంతగా ఆ పార్టీల్లోకి చేరికలూ జరగడం లేదు.

ఒకటి ప్రకటించిన బీఎస్పీ..

బహుజన్ సమాజ్ పార్టీ జిల్లాలో నాలుగో బలమైన పార్టీ. నిర్మల్ నుంచి 2014లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీఎస్పీ నుంచే గెలుపొందారు. నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లోనూ అప్పాల గణేశ్‌చక్రవర్తి ఏనుగు గుర్తు నుంచే మున్సిపల్ చైర్మన్ అయ్యారు. గత ఎన్నికల్లో బరిలో నిలిచిన బీఎస్పీ తరఫున నిర్మల్ నుంచి సొదాని భూమన్నయాదవ్, ముధోల్ నుంచి రాథోడ్ సురేఖ, ఖానాపూర్ నుంచి అజ్మీరా హరి నాయక్ పోటీ చేశారు. అప్పుడు ఆపార్టీ అధినేత్రి మాయావతి అభ్యర్థుల తరఫున ప్రచారం కోసం నిర్మల్ వచ్చారు. ఐపీఎస్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత యువతతోపాటు పలువర్గాల్లో బీఎస్పీకి ఆదరణ పెరిగింది. ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి ఒక్క ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా స్వేరో బన్సీలాల్ రాథోడ్‌ను పార్టీ ప్రకటించింది. ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. నిర్మల్, ముథోల్‌పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక్కడ ఇంకా ఎవరైన బడా లీడర్ పోటీ చేస్తారేమోనన్న ఆశలు పార్టీలో ఉన్నాయి. రెండుమూడు రోజుల్లో ఈ రెండు చోట్లా అభ్యర్థులను ప్రకటిస్తామని బీఎస్పీ నాయకులు చెబుతున్నారు.

'ఆప్' నిర్మల్‌కే పరిమితం..

ఢిల్లీ, పంజాబ్‌లో గెలిచిన తర్వాత ఆమ్‌ఆద్మీ పార్టీకి జిల్లాలోనూ కొంత క్రేజ్ ఏర్పడింది. రాష్ట్రంలోనూ విస్తరణకు ప్రయత్నాలు చేసినప్పటికీ అనుకున్న స్థాయిలో ఎదగలేకపోయింది. పలువురు సీనియర్లు పార్టీలో చేరినట్లే చేరి, మళ్లీ వెళ్లిపోయారు. నిర్మల్ స్థానం నుంచి పోటీ చేయడానికి ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ హైదర్ ఇప్పటికే నామినేషన్ వేశారు. ఢిల్లీ వరకూ వెళ్లి పార్టీ పెద్దలను ఒప్పించి బీఫామ్ తెచ్చుకున్న హైదర్ ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ముథోల్, ఖానాపూర్ నుంచి ఆప్ పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు.

'చేతి'లో చెయ్యేసిన టీజేఎస్, వైఎస్ఆర్‌టీపీ..

తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెతున్న ఎగిసేలా ముందుకు నడిపి ప్రొఫెసర్ కోదండరాం పెట్టిన తెలంగాణ జనసమితి జిల్లాలో జాడలేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొనాలనే దిశగా వెళ్తోంది. ఇదే దిశగా వైఎస్. షర్మిల ప్రారంభించిన వైఎస్ఆర్‌టీపీ కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేయాలని డిసైడ్ చేసింది.

'కారు'తోనే 'పతంగి'..

జిల్లాలో తమకంటూ బలం ఉన్నా ఎమ్మెల్యే గెలిచే స్థాయిలో లేమని ఎంఐఎం ప్రతీసారి అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటూ వస్తోంది. కేవలం మైనార్టీ ఓటు బ్యాంకుతో గెలువలేమని అందుకే ఈ సారీ బీఆర్ఎస్‌కు మద్దతు ఉంటుందని, కానీ కచ్చితంగా గెలుపోటములను ప్రభావితం చే స్తామని ఎంఐఎం నేతలు చెబుతున్నారు.

ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి 'ప్రవాసీమిత్ర'..

గల్ఫ్ బాధితుల సమస్యలు, వలసలు, ఉపాధి కోసం వెళ్లి తిరిగివచ్చిన వారికోసం కొన్నేళ్లుగా ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ పేరిట పనిచేస్తున్న స్వదేశ్ పరికిపండ్ల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గల్ఫ్ యూనియన్లు తీసుకున్న నిర్ణయం మేరకు నిర్మల్ నియోజకవర్గం నుంచి ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థిగా రంగంలో దిగేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు బాలల సంరక్షణశాఖలో చేస్తున్న ఉద్యోగాన్నీ స్వదేశ్ వదులుకోవడం గమనార్హం.

జనంలో లేని జనసేన..

నటుడిగా పవన్‌కల్యాణ్‌కు జిల్లావ్యాప్తంగా భారీసంఖ్యలో అభిమానులు ఉన్నారు. ఆయన పేరిట అభిమాన సంఘాలూ ఉన్నాయి. కానీ ఆయన ప్రారంభించిన జనసేన పార్టీ విషయానికి వచ్చేసరికి ఎలాంటి ఆదరణ లేదు. కనీసం పార్టీ కార్యకర్తలమని చెప్పుకునేవాళ్లు, కార్యవర్గాలూ లేవు. బీజేపీతో పొత్తు చర్చలు కొనసాగుతున్నా.. జిల్లా ఆ పార్టీ ప్రభావం శూన్యమనే చెప్పవచ్చు.

ఉద్యమ పార్టీలుగానే 'లెఫ్ట్'..

సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర వామపక్ష పార్టీలకు జిల్లాలో కొంతమేరకు జనాన్ని ప్రభావితం చేయగలిగే నాయకులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసే స్థాయికి ఎదగడం లేదన్న వాదన ఉంది. ఇప్పటికీ ఏ సమస్య వచ్చినా ముందుండి లెఫ్ట్ పార్టీలు ఉద్యమాలను నడిపిస్తున్నాయి. సదరు ఉద్యమాల్లో వందలాదిమంది పాల్గొంటున్నారు. నేతలు చెప్పినట్లు చేస్తున్నారు. తీరా ఎన్నికల వరకు వచ్చేసరికి కనీసం పోటీలో కూడా ఉండటం లేదు. ప్రస్తుత ఎన్నికల్లోనూ జిల్లాలో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీలు బరిలో నిలిచే అవకాశాలు కనిపించడం లేదు.

జంగ్ తెలంగాణ

పకడ్బందీగా ఎన్నికల వ్యయ పరిశీలన

- ఎన్నికల వ్యయ పరిశీలకులు కేఎం.శ్రేయాస్
- ఖర్చు నమోదుపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న శ్రేయాస్, పక్కన కలెక్టర్ ఆశీష్

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకులు కేఎం.శ్రేయాస్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, మూడు నియోజకవర్గాల ఎన్నికల వ్యయ అధికారులతో కలిసి నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్ టీం సభ్యులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ ఎస్ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లు నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్వహించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్య చట్టం 127 ఏ ప్రకారం నిబంధనలు పాటించాలని అన్నారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలని తెలిపారు. దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలని, సోషల్ మీడియాపై నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా డబ్బు, మద్యం పంపిణీ ఫ్లయింగ్ స్క్వాడ్లు ఎస్ఎస్‌టీతనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. బ్యాంకు లావాదేవీలు రూ.10 లక్షలు మించి నగదు, జమ, ఉపసంహరణ, ఆన్‌లైన్ ద్వారా మల్టిపుల్ లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. అన్ని టీంలు అప్రమత్తతతో పని చేయాలని తెలిపారు. సి విజిల్ యాప్, పర్యవేక్షణ ఉండాలన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో మూడు నియోజక వర్గాలకు సంబంధించి 19 మండలాలకు పీవో, ఏపీవోలను నియమించామని తెలిపారు. ఎస్‌వోపీ గ్రీవెన్స్ టీం ద్వారా సీజ్ చేసిన డబ్బు, మద్యం, ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఓటరు అవగాహనపై స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఎంసీసీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ బృందాల వద్ద 24 గంటలపాటు వీడియోగ్రఫీ అందుబాటులో ఉండాలని, స్టాటిక్ సర్వేలెన్స్ చెక్ పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పని చేయాలని, ఏదైనా ఇబ్బంది ఎదురైతే తెలియజేయాలన్నారు.

మీడియా కేంద్రం పరిశీలన..

సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని ఎన్నికల వ్యవయ పరిశీలకుడు శ్రేయాస్ సందర్శించారు. అభ్యర్థుల పెయిడ్ న్యూస్, ప్రకటనల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసి 1950 టోల్‌ఫ్రీ నంబర్, సి విజల్ యాప్, సోషల్ మీడియా మానిటరింగ్, ఎల్రక్టానిక్ మీడియా మానిటరింగ్, ఎంసీఎంసీ కమిటీ పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఎంసీఎంసీ కన్వీనర్ తిరుమల పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: అన్ని కులాలు, మతాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేశారని నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ మోచి సంఘం, నాయుడువాడ, రామ్‌రావుబాగ్, బంగల్‌పేట్‌లో సర్వ కులసంఘాలు, ధ్యాగావాడలో సోమక్షత్రియ సంఘం, తిరుమల గార్డెన్‌లో ఆటో యూనియన్, గాజుల్‌పేట్‌లో రసపుత్ర కుల సంఘ సభ్యులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మోచి సంఘ భవనంకు గతంలో రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రతీ కుల సంఘుల భవనాలకు అన్నిరకాల సహాయ సహకారాలు అందించామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హడావుడి చేస్తున్న వారిని దూరం పెట్టాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలి, అభివృద్ధి జరగాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు అప్పాల మహేశ్, ముడుసు సత్యనారాయణ, లింగంపల్లి లక్ష్మీనారాయణ, అప్పాల ప్రభాకర్, పూదరి నరహరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో పట్టణంలోని కూరన్నపేట్‌కు చెందిన 50 మంది, పింజారి గుట్టకు చెందిన 200 మంది మైనార్టీ యువకులు , సోఫీ నగర్‌కు చెందిన 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశమివ్వండి

- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు



గడపగడపకూ ప్రచారం చేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చి, రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంరావ్‌బాగ్, నాయుడువాడలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ఆరు గ్యారంటీ హామీలు వివరించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సోనియాగాంధీ ఆలోచనకు అనుగుణంగా కాంగ్రెస్ కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్షతోపాటు తులం బంగారం కానుకగా ఇస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో సిలిండర్ 500 లకే ఇస్తున్నామని, అధికారంలోకి వస్తే తెలంగాణలోనూ ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీ యువకులు..

జిల్లా కేంద్రంలోని గాజులపేట్, బర్కత్‌పుర కాలనీకి చెందిన షాదాబ్ నేతత్వంలో 500 మంది మైనారిటీ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పదేళ్లుగా మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

రోడ్డేస్తే ఓటేస్తాం

- గంగాపూర్ వాసులతో అధికారులు సమావేశం..
- వంతెన నిర్మిస్తేనే ఓటేస్తామన్న గ్రామస్తులు

కడెం: రోడ్డేస్తేనే ఓటేస్తామని ఉమ్మడి గంగాపూర్ వాసులు మరోసారి తేల్చిచెప్పారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తేనే ఓటు వేస్తామని, లేకుంటే ఎన్నికలు బహిష్కరిస్తామని గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా పంచాయతీ వాసులు ఇటీవలే నిర్ణయించారు. కొద్ది రోజులుగా ఉపాధ్యాయులు, కార్యదర్శులు, ఆటవీ, తదితర ప్రభుత్వ అధికారులను గ్రామంలోకి రానివ్వడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి, ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి ఆదివారం గంగాపూర్‌కు వెళ్లారు. మూడు గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో వంతెన నిర్మాణం, రోడ్డు సౌకర్యం గురించి ఈనెల 15వ తేదీ తర్వాత కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులను మాట్లాడిస్తామని, అసెంబ్లీ ఎన్నికలకు సహకరించాలని, అందరూ ఓటువేయాలని సూచించారు. కానీ, గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓటు వేయమని, తమ నిర్ణయం మార్చుకోమని స్పష్టం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. సమావేశంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ఉపేందర్, ఎఫ్ఆర్‌వో అనిత, సీఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

న్యూస్‌రీల్

బీసీ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



బండి సంజయ్‌తో ఉమ్మడి జిల్లా నాయకులు

నిర్మల్‌ఖిల్లా: ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కోరారు. కరీంనగర్‌లో బీసీ ఆత్మగౌరవ సభ సన్నాహక సమావేశంలో ఆదివారం నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గాదే విలాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఈనెల 7న హైదరబాద్ ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన బీసీల ఆత్మగౌరవ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని తెలిపారు.

జేపీ వ్యాఖ్యలు అర్థరహితం

- సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు




కుంటాలలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కుంటాల: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేస్తే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం అవుతుందని లోక్‌సత్తా అధినేత, ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని తెలంగాణ రాష్ట్ర పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు అన్నారు. జేపీ వ్యాఖ్యలను ఖండించారు. ఐఏఎస్, ఎమ్మెల్యే పెన్షన్ రెండూ తీసుకుంటున్న జేపీ, ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వొద్దని అనడం సరికాదన్నారు. జేపీ ఇప్పటివరకు తీసుకున్న పెన్షన్ ప్రభుత్వానికి సరెండర్ చేసి నిజాయతీ చాటుకోవాలని హితవు పలికారు. ఇప్పటివరకు ఐదు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని తెలిపారు. అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో పాత పెన్షన్ చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, తాటి గంగదాస్, నారాయణ, వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఉనికి ప్రశ్నార్థకం..!

- ఉమ్మడి జిల్లాలో ప్రాభవం కోల్పోతున్న వైనం
- ఏడు సార్లు విజయబావుటా
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో ప్రాతినిధ్యం
- 2014 నుంచి మసకబారుతున్న పార్టీ



దాజీ శంకర్‌రావు



కస్తాల రామకిష్టు



గుండా మల్లేశ్



రంగనాథరావు బోలన్‌వార్

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. ప్రజా ఉద్యమాలు పరమావధిగా, సమసమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా నిర్మితమైన పార్టీ ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు గట్టి పట్టు సాధించింది. నిజాం నిరంకుశ, రాచరిక పాలన, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం చేసి పీడిత, తాడిత, అట్టడుగు వర్గాలకు చేరువైంది. అంతటి ఘనకీర్తిని సాధించిన సీపీఐని ఉమ్మడి జిల్లా ప్రజలు ఎంతగానో ఆదరించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల నుంచి 2004వరకు జరిగిన ఎన్నికల్లో ఏడు పర్యాయాలు పార్టీ విజయం సాధించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మూడేసి సార్లు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఓసారి విజయ కేతనం ఎగురవేసింది. శాసనసభలో ప్రజల పక్షాన వాణి వినిపించి ఎర్రజెండా ఖ్యాతిని కమ్యూనిస్టులు ఎలుగెత్తి చాటారు. 2014 నుంచి సీపీఐ ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తుండగా.. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తుందా..? లేదా..? అనే అనుమానాలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతుండడం గమనార్హం.

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో..

తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం చేసిన కమ్యూనిస్టులను జిల్లా ప్రజలు అక్కున చేర్చుకున్నారు. సాయుధ పోరాట విరమణ అనంతరం 1952లో దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరిగాయి. తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండడంతో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు నేత దాజీ శంకర్‌రావు ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో మరో కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ రంగనాథరావు బోలన్‌వార్ కూడా పీడీఎఫ్ అభ్యర్థిగా విజయం సాధించారు. 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా కస్తాల రామకిష్టు శాసనసభకు ఎన్నికయ్యారు.

గతమెంతో ఘనకీర్తి..

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహించిన సీపీఐ క్రమక్రమంగా ఆధిపత్యాన్ని కోల్పోతూ వస్తోంది. ఎర్రజెండా మెరుపు కానరాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం సన్నగిల్లడంతోపాటు ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్నికల్లో తలపడే అర్థబలం, అంగబలం లేకుండా పోయి చతికిల పడినట్లుగా సీపీఐ శ్రేణులు అంగీకరిస్తున్నారు. ఒకానొక దశలో ఉమ్మడి జిల్లాలో ఎర్రజెండాను రెపరెపలాడించిన కమ్యూనిస్టులు ప్రస్తుత వర్తమాన కాల పరిస్థితులకు సరితూగలేక ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయలేక పొత్తులకు సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో గతమెంతో ఘన కీర్తిగా చెప్పుకోవాల్సిన పరిస్థితులు కమ్యూనిస్టులకు ఏర్పడ్డాయి.

ఈసారి ఎన్నికల్లో..

ఉమ్మడి జిల్లాలో 2014 ఎన్నికల నుంచి సీపీఐ ప్రాతినిధ్యం కరువైంది. 2018 ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా గుండా మల్లేష్ పోటీ చేసి ఓటమి చవి చూశారు. ఈసారి ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దఫా కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నా పొత్తుల వ్యవహారం ఇంకా కొలిక్కి రానట్లుగా తెలుస్తోంది. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆరాటపడగా కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయించడానికి సుముఖత వ్యక్తం చేసినట్లుగా ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఆ స్థానం నుంచి కూడా పోటీ చేసే అవకాశాలు లేనట్లుగా తెలుస్తుండగా కమ్యూనిస్టు శ్రేణుల్లో నిరాశ ఆవరించింది.

ఆసిఫాబాద్‌లో ఎర్రజెండా రెపరెపలు

పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం సీపీఐకి బలమైన పట్టు కలిగిన స్థానంగా విరాజిల్లింది. 1983లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రథమంగా గుండా మల్లేష్ సీపీఐ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలోనూ ఎమ్మెల్యేగా గెలిచి సత్తా చాటారు. 1985లో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లోనూ గుండా మల్లేష్ సీపీఐ తరఫున పోటీలో నిలబడి విజయబావుటా ఎగురవేశారు. ఆ తర్వాత 1994లో జరిగిన ఎన్నికల్లోనూ మల్లేష్ గెలిచారు. వరుసగా మూడు దఫాలు ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మల్లేష్ విజయం సాధించి తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగి పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నుంచి వేరుపడి బెల్లంపల్లి కొత్త నియోజకవర్గంగా ఏర్పడింది. బెల్లంపల్లికి 2009లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేష్ ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డుకెక్కారు. ఆ తీరుగా నాలుగు పర్యాయాలు గుండా మల్లేష్ సీపీఐ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు.

కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

నిర్మల్ రూరల్: కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం(కేవా) జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తోడిశెట్టి చంద్రయ్య, అధ్యక్షుడిగా తోడిశెట్టి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సాయన్న, కోశాధికారిగా మారుపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మద్దికుంట భూషణ్, తోడిశెట్టి శ్యాంసుందర్, చిలివేరి అశోక్‌కుమార్, సహాధ్యక్షులుగా కొత్తపల్లి నరేష్ కుమార్, కానుగుల ముత్యం, సెగ్గెం శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఆరెపల్లి రాజేంద్రప్రసాద్, సిలారి సూర్యప్రకాశ్, మూడపల్లి శైలజ, ప్రచార కార్యదర్శులుగా సెర్వూర్ సత్యనారాయణ, పోతుగంటి వెంకటేశ్, మహిళా కార్యదర్శులుగా తోడిశెట్టి రాధిక, సిలారి సంధ్యారాణి కార్యదర్శులుగా క్రాంతి కుమార్, ఆమెడ సాయన్న, రాజారపు వినోద్‌కుమార్, గౌరవ సలహాదారులుగా తోడిశెట్టి భోజన్న, తోడిశెట్టి గంగన్న, శనిగారపు భోజన్న, సిలారి ముత్తన్న, శనిగారపు భీమన్న, పోతుగంటి లక్ష్మణ్, ఆరేపల్లి రవీందర్, శనిగారపు రాములు, రాజన్న గౌరవ సలహా సభ్యులుగా తాళ్లపల్లి నారాయణ, మధు సిలారి, తోడిశెట్టి రవికాంత్, శనిగారపు నారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని కులబాంధవులు అభినందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ధాన్యం పందులపాలు..



ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు యార్డుకు తెచ్చిన ధాన్యం పందుల పాలవుతోంది. పంట చేతికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. ధాన్యాన్ని నేరుగా యార్డుకు తరలిస్తున్నారు. అయితే అక్కడ రక్షణ లేకపోవడంతో పందులు, కోతులు తింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఖానాపూర్

క్లుప్తంగా

'ఎమ్మెల్యే వైఖరితోనే బీఆర్ఎస్‌ను వీడా'

కైలాస్‌నగర్: ఎమ్మెల్యే జోగు రామన్న అణిచి వేత వైఖరి కారణంగానే తాను బీఆర్ఎస్ వీడానని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నేత బాలూరి గోవర్ధన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జోగు రామన్న కన్నా ముందే బీఆర్ఎస్‌లో చేరిన తనను అడుగడుగునా ఎమ్మెల్యే అణగదొక్కేం దుకు యత్నించారని పేర్కొన్నారు. మున్సిపల్, గ్రంథాలయ, మార్కెట్ కమిటీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ ఇలా వివిధ ఏడు పద వులు ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. డీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చేం దుకు సీఎం కేసీఆర్ ఒప్పుకున్నప్పటికీ రామ న్ననే అడ్డుకున్నారని తెలిపారు. చివరకు తాను పార్టీ మారే విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ తనకు ఫోన్ చేసి ఎమ్మెల్యే ఒత్తిడితోనే అపాయింట్‌మెంట్ ఇవ్వలేకపో యానని చెప్పారని వివరించారు.

ఐదుగురిపై కేసులు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలో ఐదుగురి దుకా ణ దారులపై ఆదివారం కేసులు నమోదు చేసిన ట్లు వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు కలీమ్, ము రళీ తెలిపారు. ఎన్నికల నియమా వళి ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత షాపు తెరవడంతో ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీసీఎస్ సీఐ మల్లేశ్, ఎస్సై రవీందర్ తెలిపారు. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎండీ మోసిన్ నర్సాపూర్(జి)లో అద్దె ఇంట్లో బియ్యాన్ని నిల్వచేశారని ఆదివారం అందిన సమాచారంతోనే దాడి చేశామన్నా రు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్య నిమిత్తం సివిల్ సప్లై అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు. మోసిన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత



పట్టుకున్న నల్లబెల్లంతో పోలీసులు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామంలో గుడుంబా తయారీకి వినియోగిస్తున్న 20 కిలోల 700 గ్రాముల నల్లబెల్లాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. గుడుంబా తయారీ చేస్తున్న జాదవ్ మంగీలాల్‌ను ఇంటివద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.1,660 విలువ గల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుస్సాడీ షురూ

పండుగ సమీపిస్తున్న వేళ గిరిజన గూడేలు ముస్తాబవుతున్నాయి. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా దండారీ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివాసీల ప్రత్యేక పండుగగా పిలిచే ఈ వేడుకలకు అంతా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో వెయ్యి గూడేల్లో గ్రామాల పెద్దలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.

- దండారీలకు ముస్తాబైన 'గిరి'పల్లెలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామపెద్దలు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఆదివాసీల ప్రత్యేక పండుగగా గుర్తింపు
- దీపావళి వరకు కొనసాగింపు



నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు

కెరమెరి: ఆదివాసీలకు పండుగ భావించే దండారీ ఉత్సవాలు రానే వచ్చాయి. నేటి నుంచి కొన్నిచోట్ల ప్రారంభం కాగా, రెండు రోజుల తర్వాత ప్రతీచోట జరగనున్నాయి. దండారీ సమూహాలుగా చేరి నృత్యాలు ప్రదర్శిస్తారు. నెమలిఈకలు పొదిగిన టోపీ, తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, జింకలేదా, మేక చర్మాన్ని ధరించి నృత్యాలు చేస్తారు. డప్పుల తోపాటు, పేప్రే, తుడుం, కాలికోమ్ తదితరాలను వాయిద్యాలుగా వాడుతారు. భోగి నుంచి ప్రారంభమై కోలబోడికి ఈ దండారీ ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు గుస్సాడీలకు కావల్సిన పరికరాల మరమ్మతుల్లో ఆదివాసీలు నిమగ్నమయ్యారు. ప్రేక్షకులు ఆదివాసీల మనసులను రంజింపజేసే డప్పుల తయారీతోపాటు గుస్సాడీలు తలపై ధరించే నెమలి పింఛాలు, కాళ్లకు కట్టే గజ్జెలకు మరమ్మతు చేస్తున్నారు.

భోగితో ప్రారంభమై..
కోలబోడితో ముగింపు

భోగి పండుగతో దండారీ ప్రారంభమవుతాయి. గుస్సాడీ, దండారీ ఏ గ్రామంలో ఉంటుందో అక్కడ వారు భోగి నిర్వహిస్తారు. అదేరోజు నుంచి గుస్సాడీ నృత్యాలు ప్రారంభమవుతాయి. దండారీల్లో అనేక రకాలున్నాయి. భేటికోలా, మానుకోల, సదర్‌కోలా, కోడల్‌కోలా, కలివల్‌కోలా తదితర రకాలు కోలలతో మహిళలు, పురుషులు దండారీ నృత్యాలు చేస్తారు. చివరిరోజు కోలబోడి చేస్తారు. ఆరోజు ఇంటిల్లిదిపాటు శుభ్రం చేసి గ్రామస్తులు, పెద్దలు గ్రామచివరిలో ఉన్న జమ్మిచెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే ఆభరణాలు ఓ చెట్టుకు కట్టేస్తారు. హారతి నిర్వహిస్తారు.

నెమలిటోపీల తయారీకి ప్రసిద్ధి

నెమలి పింఛం టోపీల తయారీలో మండలంలోని పాటగూడ గ్రామం ప్రసిద్ధి. పాతికేళ్ల నుంచి గ్రామస్తులు వీటిని తయారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యూ), కెరమెరి, తిర్యాణి, వాంకిడి తదితర గ్రామాలకు చెందిన వారు ఇక్కడి నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దీంతో ఆ గ్రామస్తులు పదిరోజుల క్రితం నుంచి ఈ పనులు ప్రారంభించారు. ఒక్కో నెమలి పింఛాల టోపీ ఖరీదు రూ.10 వేలు ఉంటుంది. తయారీకి కూలీ రూ.3 వేలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి దీపావళి వరకు..

దీపావళి పురస్కరించుకుని ప్రారంభమయ్యే గుస్సాడీ ఉత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆయా గ్రామాలు దండారీ ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఏత్మాసార్ పేన్ దీక్షా స్వీకరించిన భక్తులు గుస్సాడీ తయారవుతారు. దీపావళికి వారం ముందుగానే ఉమ్మడి జిల్లాలోని అనేక ఆదివాసీ గూడెల్లో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రదర్శించే నాటికలు ఎంతో ఆదరణ పొందుతున్నాయి.

ప్రారంభమైన దండారీ ఉత్సవాలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తేజాపూర్ పంచాయతీ పరిధి సాలేగూడలో భోగి పూజలతో ఈ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. గ్రామ పటేల్ మడావి కిషన్ ఇంటి ఎదుట యేత్మసూర్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దీపావళి తర్వాత కోలబోడి పూజలతో ఈ ఉత్సవాలను ముగిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. సర్పంచ్ మడావి కామేశ్వరి భీంరావ్, గ్రామపెద్దలు మడావి ధర్ము, కోవా కాశీరామ్, నైతం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నియమ నిష్ఠలతో..



దండారీ వేడుకలను ఎంతో నియమ నిష్ఠలతో జరుపుకుంటాం. భోగి నుంచి ప్రారంభమై ఈ ఉత్సవం కోలబోడి వరకు కొనసాగుతుంది. దండారీ రోజుల్లో ఆద్యంతం ఉత్సాహభరితంగా ఉంటుంది. ఉత్సవాలు జరిగే వరకు గ్రామంతా ఒకేచోట చేరి ఉల్లాసంగా గడుపుతాం. ఈ పండుగ మాలో ఐక్యతను చాటుకుంటుంది.

– దుందేరావు, చౌపన్‌గూడ

తరాలుగా ఆచారం



తరతరాలుగా వస్తున్న ఆచారం దండారీ ఉత్సవం. తాతముత్తాత నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికి కాపాడుకుంటూ వస్తున్నాం. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గుస్సాడీ, ఉత్సవాలతో తెలుస్తాయి. ప్రతిఏటా నిర్వహించే వారే కాకుండా నూతనంగా కూడా దండారీలు నిర్వహిస్తుండడం..భక్త ప్రపత్తులను చాటి చెబుతుంది.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ, కెరమెరి



నెమలి పింఛం టోపీలు తయారు చేస్తున్న పాటగూడ వాసులు



సంప్రదాయ వాయిద్యాలు



దండారీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎఫ్‌డీవో బర్నోబా



పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో బర్నోబా

తాంసి: పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల శివారులో పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. తాంసి(కె) శివారులో పులి సంచరించిన ప్రదేశాన్ని అటవీశాఖ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి పరిశీలించారు. బేస్ క్యాంపు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమీప గ్రామాల ప్రజలు అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. పంటచేలకు గుంపులుగా వెళ్లాలని సూచించారు. వారి వెంట అటవీసెక్షన్ అధికారి హైమద్, బీట్‌అధికారి సాయికుమార్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు తదితరులున్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, ఎస్సై

నేరడిగొండ: కుప్టి అండర్ బ్రిడ్జి వద్ద మద్యం పట్టుకున్నట్లు ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, నేరడిగొండ ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన పోతుగంటి స్వామి ఆదివారం కుప్టి అండర్ బ్రిడ్జి వద్ద అక్రమ మద్యం ఒక సంచితో ఉన్నాడు. పక్కా సమాచారంతో అతన్ని అదుపులో తీసుకుని సంచిని పరిశీలించగా రూ.15 వేల విలువ గల మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ఆయనపై కేసు నమోదు చేయడంతో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

సోన్: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో బెల్టుషాపుల్లో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు. రూ.39,820 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో వృద్ధురాలికి వేధింపులు

- ఇల్లు వదిలి వృద్ధాశ్రమంలో చేరిక



వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరిబాయి

ఆదిలాబాద్‌టౌన్: మంత్రాల నెపంతో వృద్ధురాలిని స్థానికులు వేధింపులకు గురిచేశారు. దీంతో ఆమె మనస్తాపం చెంది గత మూడు నెలల క్రితం తన ఇంటిని వదలాల్సిన దుస్థితి నెలకొంది. ఉట్నూర్ మండలంలోని వేణునగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వృద్ధురాలు బక్కుబాయి ఢోలేకు నా అనేవారు ఎవరు లేరు. ఆమెకు చిన్నప్పుడే పెళ్లి జరిగింది. భర్త అప్పుడే వదిలేశాడు. తన చెల్లె కుమారుడు ప్రవీణ్ వద్ద ఉంటోంది. ఇటీవల ఆయన భార్య చిన్నపాటి విషయాలపై గొడవపడేది. దీంతో ఆమె తన సొంతింటికి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వారు మంత్రాలు చేస్తున్నావంటూ తరచూ వేధింపులకు పాల్పడటం, కొట్లాటకు దిగడంతో ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చింది. తన మరో చెల్లెలు ఇంట్లో గతకొన్ని రోజులుగా ఉంటోంది. అక్కడ ఉండలేక ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఆదివారం దుర్గానగర్‌లోని ఆలయం వద్ద ఒంటరిగా కూర్చొంది. కన్నీరుమున్నీరవుతుండగా స్థానికులు గమనించి ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరిబాయి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె అక్కడికి చేరుకుని ఆమెను పలకరించింది. పూర్తి విషయాలు తెలుసుకుని ఆదిలాబాద్‌లోని కేఆర్‌కేలో గల వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. గతంలో చుట్టుపక్కల వారు మంత్రాల నెపంతో వేధించారని ఉట్నూర్ పోలీసులను ఆశ్రయిస్తే పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో పక్కా సమాచారంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ సిబ్బందితో కలిసి ఆదివారం పేకాటస్థావరంపై దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,680 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

భైంసాటౌన్: పట్టణంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సందీప్ తెలిపారు. స్థానిక వినాయక్‌నగర్‌లోని మహాలక్ష్మి జువెల్లరీ మార్కెట్ సమీపంలో ఆదివారం రాత్రి పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా, పేకాడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.55,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

జైనథ్: అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాగి ఇస్తారి (44), రుక్మాబాయి భార్యభర్తలు. వీరికి కుమారుడు శివకుమార్ ఉన్నాడు. వీరంతా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణ కోసం ఇస్తారి అప్పులు చేశాడు. గత రెండేళ్లుగా చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది శనివారం కౌలుకు తీసుకున్న చేనుకు వెళ్తున్నానని భార్యతో చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం పురుగుల మందు తాగి కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబీకులు అక్కడకు చేరుకుని అతన్ని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషాదం నింపిన వేడుకలు

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు
- నిర్మల్ జిల్లా చిన్నబెల్లాల్ గ్రామంలో ఘటన




పెంద్రం మోహన్(ఫైల్)



ఆత్రం భీంరావు(ఫైల్)

కడెం: గోండు వీరుడు కుమురంభీం వర్ధంతి కార్యక్రమం నిర్మల్ జిల్లాలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామపంచాయతీ పరిధిలోని గొండుగూడలో ఆదివారం భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జెండా గద్దె వద్ద భీం చిత్రపటాన్ని పెట్టి జెండా ఎగురవేసేందుకు ఇనుప పైపు అమరుస్తుండగా అది సమీపంలోని 11 కేవీ విద్యుత్ తీగకు తగిలింది. విద్యుత్ సరఫరా కావడంతో పైపును పట్టుకున్న మోహన్, భీంరావు, వెంకట్‌రావు షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన స్థానికులు బాధితులను విద్యుత్ సరఫరా నిలిపివేయించి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పెంద్రం మోహన్(25) మార్గమధ్యలో మరణించాడు. ఆత్రం భీంరావు (26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరో బాధితుడు వెడ్మ వెంకట్‌రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆత్రం భీంరావుకు భార్య గంగామణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెంద్రం మోహన్ బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఇద్దరు యువకుల మృతితో చిన్నబెల్లాల్ గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


గిరిజన సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన సమస్యలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం లక్కారంలోని రాంజీగోండ్ భవన్‌లో టీఏజీఎస్ ఆధ్వర్యంలో 'రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో గిరిజన సమస్యలు అనే అంశంపై'రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వక్తలు పాల్గొని మాట్లాడుతూ గిరిజనుల కోసం ఉట్నూర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని, జీవో 3ని పునరుద్ధరించడం, 1/70, పీసా చట్టాలు పకడ్బందీగా అమలుతోపాటు, ఉట్నూర్, భద్రాచలం కేంద్రాలుగా ఏజెన్సీ జిల్లాలుగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీ వేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయాలన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం అధి కారికంగా నిర్వహించి ఆ రోజున సెలవు ప్రకటించాలని కోరారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, రాజ్‌గోండ్ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి పుర్క బాపురావు, ఆదివాసీ మహిళా సంఘం నేత ఆత్రం సుగుణ, జేఏవైఎస్ మండల అధ్యక్షుడు ప్రకాశ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి విజయ్, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుశ్, జిల్లా అధ్యక్షుడు విష్ణు, మండల అధ్యక్షుడు కనక మల్కు, కార్యదర్శి నాగోరావు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన పబ్జీ గేమ్



వికాస్ మృతదేహం

ఇంద్రవెల్లి: పబ్జీ గేమ్‌కు బానిసై ఏడాది క్రితం మానసిక స్థితి కోల్పోయిన ఓ యువకుడు సెల్ టవర్ పైనుంచి పడి మృతిచెందాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సునిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన దుర్వ జగదీశ్–మోహన్‌బాయి దంపతుల కుమారుడు వికాస్(19) ఇంటర్ మధ్యలోనే మానేశాడు. పబ్జీ గేమ్‌కు అలవాటు పడి ఇంట్లోనే ఉంటూ ఏడాది క్రితం మానసిక స్థితి కోల్పోయాడు. శనివారం రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రి దేవాపూర్ నుంచి ముత్నూర్ గ్రామానికి చేరుకొని గ్రామ సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్తులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మానసిక స్థితి సరిగా లేక సెల్‌టవర్ ఎక్కి పైనుంచి పడిపోవడంతోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి మోహన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

కుభీర్: మతిస్థిమితం లేని మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎండీ.షరీఫ్ కథనం ప్రకారం..మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన మంగేవార్ హీరవ్వ(40), సాయన్న భార్యభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త ఏడేళ్ల క్రితం, నాలుగేళ్ల క్రితం కుమారుడు, రెండేళ్ల క్రితం మరో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి హీరవ్వ మతిస్థిమితం కోల్పోయింది. ఆదివారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉంది. చెల్లెలు గంగ చూసి కుటుంబీకులకు చెప్పింది. వారు భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి మామ లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన యువకుడు ఆకుల వంశీ(30) ఫిట్స్‌తో మృతిచెందాడు. ఈయన గత రెండేళ్లుగా మేడ్చల్ జిల్లా కొంపల్లిలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఫిట్స్ రావడంతో స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వంశీ తండ్రి రిటైర్డ్ టీచర్ రాజేశ్వర్ 8 ఏళ్ల క్రితం మృతిచెందాడు. మృతుడికి తల్లితోపాటు అక్క ఉన్నారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో సోమవారం అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

అరకపడతా.. అండగా ఉంటా

అసెంబ్లీ ఎన్నికల ప్రచా రంలో అభ్యర్థులు దూ సుకెళ్తున్నారు. ప్రజలను ఆకట్టుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చే స్తున్నారు. ఆదివారం తాంసి పరిసరాల్లోని పంట చేలల్లో రైతుల వద్దకే వెళ్లి ప్రచారం చేపట్టిన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి వ న్నెల అశోక్ కాసేపు అరకపట్టి ఆకట్టుకున్నారు. ఎన్నికల్లో తనను ఆదరించాలని వారికి విజ్ఞప్తి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

